శారద నన్ను ఒక కంటితో చూస్తూ ఉండటం నేను గమనిస్తూనే ఉన్నాను. నేను అప్పుడే ఆఫీసు నుంచి వచ్చాను. బూట్లు, టై విప్పి, సూటు హేంగరుకి తగిలించి, పైజామా వేసుకుంటూ శారదని గమనిస్తూనే ఉన్నాను.

శారద అంటే ఎవరో కాదు, మా చిరంజీవి భార్య. చిరంజీవి అంటే, నా బాల్య స్నేహితుడు. నేనూ, వాడూ చిన్నప్పటి నుంచి ఒక కంచంలో తిని, ఒక మంచంలో అన్నట్లుగా పెరిగాము. ఏదో సుభాషితంలో చెప్పినట్లు మా ఇద్దరిదీ పాలూ నీళ్లూ లాంటి స్నేహం. అంటే, తేడా తెలియకుండా కలిసిపోయే రకం అన్న మాట.




వాడు ఈ మహా నగరంలో ఒక ప్రైవేటు కంపెనీలో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. నేను ఉద్యోగ రీత్యా ఈ ఊరికి బదిలీ అయి వారం రోజులు అవుతూంది. ఒంటరిగాణ్ణి



చాలా రోజులకి కలిశాం గదా అని ఇక్కడ మకాం వేశాను.

ఇన వివరంగా ఎందుకు చెబుతున్నానంటే నాకూ, చిరంజీవికీ అంతస్తులో చాలా తేడా ఉంది. నేను నెలకి వేలు గంటలు సంపాదిస్తున్నాను. కుటుంబం గడవటానికే అవస్తున్నట్టుగా ఉంది వాడి పరిస్థితి. అందుకే కాబోలు, నేను ఏ పని చేస్తున్నా శారద కళ్ళు నన్ను వెంటాడుతూనే ఉన్నాయని నేను ఖచ్చితంగా చెప్పగలను. నాకు చాలా గర్వంగా ఉంది. ఏదో సంతోషం కలుగుతున్నట్టుగా ఉంది. నేను పనిగట్టుకుని చిరంజీవి వాళ్ళింట్లో దిగటానికి కారణం ఇదే. నేను తలుచుకుంటే ఈ ఊళ్ళో ఖరీదయిన హోటల్లో బస చెయ్యగలను. కాని, నాకు కొంత థ్రిల్ కావాలి. నా గొప్పలు చెప్పుకోవటానికీ, నన్ను చూసి ఆశ్చర్యపడటానికీ నాకు ఒక ప్రేక్షకుడు కావాలి.

శారద అమాయకురాలు. నేను ఈ ఊరికి ఏరోప్లేనులో వచ్చానని చెప్పినప్పుడు ఆశ్చర్యం ఆమె కళ్ళల్లో దాగింది కాదు. నేను వాడే సెంట్లు, షాంపూలు, ఖరీదయిన బట్టలు—ఇవన్నీ శారదని ఆకట్టుకున్నాయని వేరే చెప్పవలసిన పని లేదు. చిరంజీవి కూతురికి, అంటే ఆరు నెలల పాపకి నేను ఏభై రూపాయలు పెట్టి గౌను కొంటే, నా నిర్లక్ష్యానికి శారద విస్తుపోయింది.

ఇక్కడే శారదకీ, చిరంజీవికీ ఉన్న తేడా. వాడు అదో రకం మనిషి. కొంపలు అంటుకుంటాయని వాడికి అనిపించే వరకూ ఏ సంగతి పట్టించుకోడు. అలాంటి వాడు నాకు ఏమీ ప్రయోజనం లేదు. అందుకే శారద నన్ను ఒక విధంగా ఆకర్షించింది అనుకుంటాను.

మొన్న ఒక రోజున భోజనానికి ముందు యథాప్రకారం రెండు పెగ్గులు వేసుకుంటూ వాణ్ణి కూడా అడిగాను. వెధవ! వద్దన్నాడు. "సైగా, ఎంత డబ్బు ఇలా తగలేస్తున్నావేమిటి" అని అడిగాడు. నేను చెప్పిన తరవాత కూడా వాడిలో చలనం లేదు. ఊహూఁ అని ఒక మూలుగు మూలిగి ఊరుకున్నాడు. కాని, శారద మాత్రం 'అబ్బా' అనకుండా ఉండలేకపోయింది. ద బెస్ట్ పాట్ ఐ వాంట్. అదే నా క్కావలసింది.

చిరంజీవి వాళ్ళు ఉంటున్నది చాలా చిన్న ఇల్లు. వంట గది గాక రెండు గదులు ఉన్నాయి. అందులో ఒకటి నాకు కేటాయించేశారు. మిగిలిన దానిలో వాళ్ళిద్దరూ పడుకునేవాళ్ళు. చిన్న సందులో మేడమీద వాటా. నా కారు ఇంకా ఇక్కడికి రాలేదు కనక ఫర్వాలేదు. వస్తే ఇదే ఇబ్బంది.

చిరంజీవి పొద్దున్నే వెళ్ళినవాడు సాయంత్రందాకా రాడు. నేనుమాత్రం మధ్యాహ్నం వచ్చేసేవాడిని. మళ్ళీ సాయంత్రం ఏ క్లబ్బుకో వెళ్ళి, వాడు వచ్చినతరవాత వచ్చేవాడిని. ఈ మధ్యలో శారదకు నా కబుర్లు వినిపించేవాడిని. నేను చూసిన అమెరికా గురించీ, అక్కడ స్త్రీలు ఎంత సోషల్‌గా ఉండేదీ, ఒక వేళ నేను పెళ్ళి అంటూ చేసుకుంటే ఎటువంటి భార్యను ఎన్నుకునేదీ ఒకటేమిటి? అన్నీ చెప్పేసేవాడిని. శారద కళ్ళు పెద్దవి చేసుకుని వింటూ ఉండేది.

ఇలాగే మరో రెండు రోజులు గడిచే సరికి వాతావరణంలో ఏదో మార్పు వచ్చినట్టు నాకు అనిపించింది. రాత్రి పడుకోబోయే ముందు నాకు స్పష్టంగా తెలియకపోయినా, రెండో గదిలో భార్యా భర్తలిద్దరి మధ్య చిన్న వాగ్వాదం లాంటిది జరిగినట్టుగా ఉంది. బహుశా నా గురించి వాళ్ళిద్దరూ చర్చించుకుంటున్నారేమోనని అనుమానం కూడా వచ్చింది.

ఆ మరునాడు శారద ప్రవర్తనలో చాలా మార్పు కనిపించింది. నన్ను కావాలని ఎవాయిడ్ చేస్తున్నట్టుగా ఉంది. కొంపదీసి చిరంజీవిగాని మా ఇద్దరి మీదా తెలుగు సినిమాల్లో లాగా అనుమానం పడలేదు గదా? అయినా, స్నేహితుడికి, అందులో చిరంజీవిలాంటి వాడికి ద్రోహం తలపెట్టేటంతగా నా కళ్ళు దిగజారలేదు. ఒప్పుకుంటాను. నాలో ఏదో ఇన్నేట్ డిజైర్ ఉండి ఉంటుంది. అది నా బలహీనత. అవును. దానిని కంట్రోల్ చేసుకోవాలి. అయితే పెట్టాలి అంటే సాధ్యమయినంత త్వరలో ఇక్కడినించి బిచాణా ఎత్తెయ్యాలనుకున్నాను.

మరునాడు చిరంజీవి డ్యూటీకి వెళ్ళలేదు. అడిగితే ఒంట్లో బాగానే ఉంది అన్నాడు. యథాప్రకారం నేను బయలుదేరే వేళకు వాడు కూడా నాతోబాటు వచ్చాడు. దారిలో ఏదో హోటల్లో కాఫీ తాగుతూ నింపాదిగా అసలు సంగతికి దిగాడు.

"చూడు, కుమార్! డబ్బు గురించి నీకూ, నాకూ సరిగ్గా ఒకేలాంటి అభిప్రాయం ఉంటుందని నువ్వు అనుకుంటున్నావా?"

"వాట్ డూ యూ మీన్?"

"అదే ఆ మాటకే వస్తున్నాను. నేనొక సామాన్య మానవుడిని. ఇంగ్లీషులో చెప్పాలంటే 'కామన్ మాన్' అన్న మాట. ఈ దేశపు యుగంలో నాలాంటి వాడికీ, జీవితానికీ ఉండే సంబంధం నువ్వు అర్థం చేసుకోలేవు. ఎందుకంటే, అది నీ కసలు ఒక ప్రాబ్లెమ్ కాదు కనుక."

"వెధవ కబుర్లు దంచక అసలు సంగతి చెప్పరా, నాయనా!"

"అవును. నేను చెప్పేది నీకు అర్థం కాదు. సూటిగా చెప్పుతాను, విను. ఒక చిన్న పిల్లవాడున్నాడనుకో. వాడికి నీ ఆనందం కొద్దీ రోజూ ఒక బిస్కట్, చాకలెట్ ఇస్తూ ఉంటావనుకో. అది వాడికి అలవాటయిపోతుంది. ఆ తరవాత దానికోసమని ఏం చెయ్యటానికైనా, చివరికి దొంగతనానికైనా వాడు సిద్ధపడతాడు. చిన్నపిల్లలకే కాదు, ఎవరికైనా ఇది వర్తిస్తుంది. కాదంటావా?"

"నిజమే కావచ్చు. అయితే?"

"అదే నా పాయింటు. నీ పద్ధతి అతి మామూలుగా కనిపించే విషయాలు నాలాంటి వాడికి ఒక జీవిత కాలం పాటు అందరానివిగా ఉండిపోవచ్చు. డోంట్ మిస్టేక్ మి! నాకు నమ్మకం కలిగిన తరవాతనే చెప్పుతున్నాను. నా భార్య ... అంటే శారద ఒక దీపం చుట్టూ తిరగటానికి సిద్ధంగా ఉంది..."

"... ..."

"నువ్వు నాకు అన్న మిత్రుడివే. కాదనను. కాని, ఇన్ స్పైట్ ఆఫ్ ఇంటరెస్ట్..."

"అర్థమయిందిరా, బాబాయ్! అర్థమయింది. నువ్వింకా రాతి యుగంలోనే ఉన్నావని తెలియకుండా ..."

"నో నో. అదికాదు. నువ్వు కాకి పోర్షియా గురించి మాట్లాడ్డంలేదు.

ఇది భారతదేశం. నేను నీకూ, నా భార్యకీ మధ్య సంబంధం సృష్టించలేకపోయినా, చుట్టుపక్కల ఉన్న సంఘం అనబడే మానవులు ఆ పని ఖచ్చితంగా చేసేస్తారు. బట్ ఐ డోంట్ కేర్! నాకు మీ ఇద్దరూ బాగా తెలుసు. నా ఉద్దేశమల్లా, ఎండ మావుల్ని ఊహించి శారద పరుగెడుతూ ఉంటే, నా బ్రతుకు కూడా ఎడారి పాలు కాక తప్పదు. అయామ్ సారీ, మై డియర్ ఫ్రెండ్! నా జాగ్రత్తలో నే నుండక తప్పదు. అందుకని..."

"అందుకని, నేను ఈవేళ సాయంత్రమే బిచాణా ఎత్తేస్తాను. సరేనా? నీ లాజిక్ నాకు నిజమనిపించేదాకా నా ముఖం కూడా చూపించను. కాని, ఒక్క మాట. ఒక మంచి మిత్రుణ్ణి అపార్థం చేసుకుంటున్నాననే ఆలోచన ఇప్పట్లో రానియ్యకు. దాని కింకా టైముంది. ఐ విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్. బై బై!"

తరవాత చాలా నెలల కాలం దొర్లిపోయింది. నాకు అప్పుడప్పుడూ చిరంజీవి గుర్తుకొచ్చినా, పట్టుదల వల్ల వెళ్ళలేదు. ఒక రోజు సాయంత్రం పొద్దుపోక పార్కులో కూర్చుని ఉన్నాను. నాకు కొద్ది దూరంలో ఒక చిన్న పాప ఒక్కతి పరుగెడుతూ ఆడుకుంటూ ఉంది. మధ్య మధ్యలో 'నాన్నా' అంటూ అరిచి ఏదో చెబుతూంది. ఆ 'నాన్న' అనే మనిషి పిల్ల మాత్రం నాకు కనిపిస్తూంది. మానవుడు ఈ లోకంలో లేడు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నా ననుకుంటాను.

నెమ్మదిగా అడుగుతూ పాప నా దగ్గరికి వచ్చింది. పిలిచాను. చాకలెట్లు కొని పెడతాను, నాతో వస్తావా అని అడిగాను. ఓ అన్నది. తక్షణ నాకు చిరంజీవి మాటలు గుర్తుకి వచ్చాయి. అవును. అదే అలవాటయితే? నేను కూడా ఆలోచనల్లో పడ్డాను. ఇంతలో పాపని తీసుకెళ్ళటానికని ఆ వ్యక్తి నా దగ్గరికి వచ్చాడు. ఎవరో కాదు, సాక్షాత్తూ చిరంజీవి!

"ఏరా, చిరంజీవీ? ఎలా ఉన్నావు? అంతా కులాసానా? ?"

"ఆఁ ఏదో నీ దయవల్ల ఇలా ఉన్నాం."

"అది సరేగాని, నీ ఆర్గ్యుమెంటు గుర్తుందా? ఇప్పుడు కూడా అదే మాట అంటావా?" కుతూహలం కొద్దీ అడిగాను నేను.

"అదంతా తరవాత మాట్లాడు కుందాం గానీ, ఇంటికి రా ముందు నువ్వు" అన్నాడు చిరంజీవి దారి తీస్తూ.

నా కారులో వెళుతూంటే పాపకి బళ్ళే సంతోషంగా ఉంది. దారి పొడుగునా ముభావంగానే ఉన్నాడు వాడు. ఇంట్లోకి అడుగు పెట్టగానే చాలా విశేషాలు గమనించాను నేను. మునుపటికంటే చాలా పెద్ద ఇల్లు. వెళ్ళగానే హాలు, సోఫా సెట్టు, కర్టెనులు, పెద్ద రేడియోగ్రామ్, తైలచిత్రాలు—చాలా ఉన్నాయి. ఎయిర్-కండిషనర్ శబ్దం తప్ప నిశ్శబ్దంగా ఉంది ఇల్లు.

అయామని పిలిచి పాపను అప్పగించాడు చిరంజీవి. ఆశ్చర్యపోవటం ఇప్పుడు నా వంతైంది. ఉన్నట్టుండి చిరంజీవి ఏదైనా పెద్ద ఉద్యోగంలోకి మారాడా? లేకపోతే మరో రకం సంపాదనేమైనా ఉందా? అసలు ఇంతవరకూ శారద కనిపించదేం?

చిరంజీవికి మైండ్ రీడింగ్ తెలుసు ననుకుంటాను. వాడే చెప్పటం మొదలు పెట్టాడు.

"అవునురా, కుమార్! నువ్వెళ్ళిన తర వాత అక్షరాలా నేను ఊహించినట్టే జరిగింది. నా భార్య ... ఐ మీన్ ... శారద నా మీద చాలా అనుమానాలు పెంచుకుంది. నేను చాలా డబ్బు సంపాదిస్తున్నానని, అయినా, పిసినారితనం వల్ల ఖర్చుపెట్టడంలేదని, అసలు తనకు తెలియకుండా దాస్తున్నానని—ఒకటేమిటి? రోజూ వాదనలు, గోల, రాద్ధాంతం జరిగేవి. నువ్వన్నట్టు నేను రాతియుగం నాటి మనిషినే అయి ఉంటే, శారదని సున్నంలోకి ఎముక లేకుండా తన్ని ఉండేవాడిని. కాని, అదే నా బల హీనత. ఏం చెయ్యను? అందుకనే, శారదకి తెలియకపోయినా, నా మన శ్శాంతి కోసం ఈ సరంజామా అంతా కొనక తప్పలేదు. భయపడకు ... ఇప్పుడు శారద ఇంట్లో లేదు. మహిళా మండలిలో ఉంటుంది. ఇవన్నీ కొనటానికి నాకు డబ్బులా వచ్చిం దంటావా? నీ లాంటి పుణ్యాత్ముల కొందరి దగ్గర... అవును... కొన్ని వేలదాకా అప్పులు చేశాను. ఇదంతా నీ వలన కాదంటావా?"

నా దగ్గర సమాధానం రెడీగా లేదు. ఈ షాక్ నించి తేరుకోవటానికి నాకు టైమ్ కావాలి. అయినా, సానుభూతిగా అన్నాను:

"అయామ్ సారీ, చిరంజీవీ! ఇలా జరుగుతుం దనుకోలేదు. కాని, వాట్ కెన్ ఐ డూ? సారీ, నీ కింతవరకూ కలిగిన నష్టాన్ని, నా మూలంగా జరిగింది కనుక నేనే సంతోషంగా తీర్చేస్తాను. చెప్పు." నా సమాధానం నాకే నవ్వుగా ఉంది.

"సరే! తరవాత? ఎన్ని సంవత్సరాల వరకూ ఇలా జరుగుతుం దంటావు?" మళ్ళీ ప్రశ్న.

నాకు ఏం చెప్పాలో తోచలేదు. అయినా, ఆలోచించాను.

"సారీ, శారదకు చెబుతాను — ఇవన్నీ కొనటానికి నీకు అప్పిచ్చినది నేనే నని. అప్పుడైనా నమ్ముతుంది గదా?"

"గుడ్! వెరీగుడ్! జరిగింది చాలక నాకున్న కాస్త మర్యాదా తీసేస్తానంటావు. అంతేగా? ప్లీజ్! ఆ పని మాత్రం చెయ్యకు. స్నేహితుడివి గదా అని నన్ను ఇంకా బాధించవలసిన అవసరం నీకు లేదు."

చిరంజీవి మాటలకంటే, వాడి చేతిలో ఒక పిస్తోలో, కత్తో ఉండి ఉంటే నా కంత బాధ ఉండేది కాదేమో! తల పట్టుకుని కూర్చుండిపోయాను.

ఇంతలో శారద వచ్చింది. నవ నాగరికంగా ఉన్న శారదని గుర్తుపట్ట టానికి నాకు రెండు నిమిషాలు పట్టింది.

"హలో! కుమార్‌గారా! ఏమిటి, దారి తప్పారా? అవునులెండి. మాలాంటి వాళ్ళం మీ కెక్కడ కనిపిస్తాం? అన్నట్టు బయట ఉన్న కారు మీదేనా? మేం కూడా ఒకటి బుక్ చేశాం. ఇంకా రాలేదు. మరిచేపోయాను ... మా లాన్‌లో గులాబీలు చూశారా? ప్రత్యేకంగా ఢిల్లీ మొఘల్ గార్డెన్స్ నించి తెప్పించాము ... అదేమిటండీ ... స్నేహితుడు రాక రాక వస్తే ... కూల్ డ్రింక్సైనా ఇవ్వలేదు?" అంటూ వచ్చినంత దూకుడుగానూ లోపలి కెళ్ళింది.

"ఆఁ! అది సంగతి! అందుచేత నువ్వేమీ విచారించకు. మన బంగారం మంచిది కానప్పుడు ఎవరిని అని ఏం లాభం? నేను నిన్నేమీ తప్పు పట్టటంలేదు. బట్ ఒన్ థింగ్! రోజులు మారకపోవు. ఇది నా కొక అనుభవం మాత్రమే. మన స్నేహం మాత్రం ఎప్పటిలాగానే ఉండాలని నా ఆశ. ప్లీజ్! కీపిటప్!" అంటున్నాడు చిరంజీవి.

పరధ్యానంగా ఎప్పుడు బయటికి వచ్చానో నాకు తెలియదు. నేను తప్పు చేశానని నా కనిపించటం లేదు. నిజానికి ఇలాంటివే మరే సంఘటనవల్లనైనా చిరంజీవి సంసారం ఈ స్థితిలోకి వచ్చే అవకాశం లేకపోలేదు. కాని, నామూలంగా ఇలా జరగటమే విచారంగా ఉంది.

ఒక్కటిమాత్రం నిజం. చిరంజీవి స్థానంలో మరెవరైనా ఉండి ఉంటే, నాకు ఈమాత్రం నిర్ద్వందత్వం కూడా దొరికి ఉండేది కాదు. చిరంజీవిది, నాది పాలూ, నీళ్ళూ వంటి స్నేహం. వాడు నిజంగా పాలవంటివాడు.



మరపురాని మనిషి

చిత్రం—వి. వి. ఆచార్య (విజయపురి)